

పారాలింపిక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసి రికార్డు స్థాయిలో పతకాలు(29) సాధించిన భారత పారా క్రీడాకారుల బృందంతో గురువారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకంగా భేటీ అయి వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా అథ్లెట్లు తమ అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. ఈ క్రీడల్లో కాంస్యం గెలిచిన తెలంగాణ అథ్లెట్ దీప్తీ జివాంజీని అభినందిస్తున్న మోదీ.

# వ్రితి డబుల్ ధమాకా



హైదరాబాద్, ఆట ప్రతినిధి: మంగళూరు(కర్నాటక) వేదికగా జరుగుతున్న 77వ జాతీయ సీనియర్ అక్వాటిక్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. గురువారం జరిగిన వేర్వేరు విభాగపు పోటీల్లో వ్రితి స్వర్ణ, రజత పతకాలతో మెరిసింది. తొలుత జరిగిన మహిళల 800మీ ఫ్రీస్టయిల్ రేసును వ్రితి 9:16:14 సెకన్ల టైమింగ్‌తో ముగించి స్వర్ణాన్ని ఖాతాలో వేసుకుంది. ఈతకొలనులో తనకు తిరుగులేదని మరోమారు నిరూపిస్తూ జాతీయ టోర్నీలో పతకాల పంట పండిస్తున్నది. ఇదే విభాగంలో భవ్య సచ్‌దేవ(ఢిల్లీ), శ్రీచరణి(కర్నాటక) వరుసగా రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. మరోవైపు 200మీ బటర్‌ఫ్లై ఈవెంట్‌లో వ్రితి రజతం దక్కించుకుంది.

# త్వరలో స్పోర్ట్స్‌పాలసీ

**సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: క్రీడారంగ సమూల అభివృద్ధి కోసం త్వరలో స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తామని సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'సాట్స్ కార్యక్రమాలు రాష్ట్ర మంతా విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం. ముఖ్యంగా గ్రామీణ క్రీడారంగానికి ప్రాధాన్యం ఇచ్చేందుకు నూతన పాలసీని తీసుకురాబోతున్నాం. ఇందులో భాగంగా ప్రతీ లోక్‌సభ నియోజకవర్గంలో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తున్నాం. దీనికి తోడు మరో మూడు స్పోర్ట్స్ స్కూల్‌ను స్థాపించబోతున్నాం. వీటన్నింటినీ స్పోర్ట్స్ యూనివర్సిటీ అనుసంధానం చేస్తాం. హైదరాబాద్‌ను



స్పోర్ట్స్ హబ్‌గా మార్చే క్రమంలో నగరంలో ఉన్న ప్రతీ స్టేడియాన్ని పునరుద్ధరిస్తాం. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వారికి తగిన ప్రోత్సాహలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. క్రీడాభివృద్ధిలో కార్పొరేట్ కంపెనీలను భాగస్వామ్యం చేసేందుకు చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

## నేటి నుంచే డైమండ్ లీగ్

**అందరి దృష్టి నీరజ్ పైనే..**

బ్రస్సెల్స్ (బెల్జియం): ఒలింపిక్స్ ముగిసిన కొద్దిరోజుల తర్వాత ప్రపంచ టాప్ అథ్లెట్లు అంతా మళ్లీ పోటీలకు సిద్ధమయ్యారు. బెల్జియంలోని బ్రస్సెల్స్ వేదికగా శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో అథ్లెట్లు మరోసారి తమ విన్యాసాలతో అలరించనున్నారు. 32 క్రీడాంశాలలో వందలాది మంది స్టార్ అథ్లెట్లు బరిలోకి దిగనున్నారు. భారత్ నుంచి డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా, స్టీపుల్ ఛేజ్ రన్నర్ అవినాశ్ సాబ్లే అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో ఇద్దరు భారతీయ అథ్లెట్లు పోటీపడనుండటం ఇదే ప్రథమం. 2022 డైమండ్ లీగ్ ఫైనల్స్ గెలిచి 2023లో రెండో స్థానంలో నిలిచిన నీరజ్.. ఈ ఏడాదీ సత్తా చాటాలని భావిస్తున్నాడు.



## ఇషాన్ సెంచరీ

అనంతపూర్: టీమ్‌ఇండియా యువ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ దేశవాళీ సీజన్‌లో తన పునరాగమనాన్ని ఘనంగా చాటాడు. అనంతపూర్ (ఆంధ్రప్రదేశ్) వేదికగా జరుగుతున్న దులీప్ ట్రోఫీ రెండో దశ మ్యాచ్‌లో భాగంగా అతడు సెంచరీతో కదం తొక్కాడు. రెండో మ్యాచ్‌లో అతడు ఇండియా 'సీ' తరపున ఆడుతూ 126 బంతుల్లోనే 14 బౌండరీలు, 3 భారీ సిక్సర్లతో 111 పరుగులు చేశాడు. కిషన్ దూకుడుకు తోడు బాబా ఇంద్రజీత్ (78), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (46 నాటౌట్), సాయి సుదర్శన్ (43) రాణించడంతో తొలి రోజు ఆటముగిసే సమయానికి 'సీ' జట్టు 79 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 357 పరుగులు చేసింది.

### ఆదుకున్న ములానీ


ఇండియా 'బీ' బౌలర్ల ధాటికి పీకల్లోతు కష్టాల్లో చిక్కుకున్న ఇండియా 'ఏ'కు షామ్స్ ములానీ (88 నాటౌట్) ఆపద్బాంధవుడిగా నిలిచాడు. హర్షిత్ రాణా, విద్వత్ కరియప్ప, అర్ష్‌దీప్‌సింగ్ తలా రెండు వికెట్లు తీయడంతో 93 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన 'ఏ' జట్టును ములానీ, తనుష్ కొటియన్ (53) ఆదుకున్నారు.

**షూటింగ్‌లో అదరగొడుతున్న ధనుశ్ శ్రీకాంత్**

# తిరుగులేని గురి..

**ప్రపంచ బధిర షూటింగ్ టోర్నీలో పసిడి వేట**

**ప్రభుత్వ ప్రోత్సాహం కోసం ఎదురుచూపులు**



**అంతర్జాతీయ క్రీడా వేదికపై మరో తెలంగాణ క్రీడా తార తళుక్కుమంది. తన గురికి తిరుగులేదని నిరూపిస్తూ యువ షూటర్ ధనుశ్ శ్రీకాంత్ పసిడి కాంతులు విరజిమ్మాడు. జర్మనీలో ఇటీవలే జరిగిన ప్రపంచ బధిర షూటింగ్ చాంపియన్‌షిప్‌లో సరికొత్త రికార్డులతో స్వర్ణ పతకాలు కొల్లగొట్టాడు. వినికిడి లోపమున్నా..సాధారణ షూటర్లకు ఏమాత్రం తీసిపోని ధనుశ్ పతక వేటలో దూసుకెళుతున్నాడు. 14 ఏండ్ల ప్రాయంలో షూటింగ్ మొదలు పెట్టిన ఈ చిచ్చరపిడుగు డెఫ్ ఒలింపిక్స్, డెఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్ లాంటి ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించాడు. లాస్ ఎంజిల్స్(2028) ఒలింపిక్స్ తన లక్ష్యమంటున్న ధనుశ్.. ఆ దిశగా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో లెక్కకు మిక్కిలి పతకాలు సాధించిన ఈ యువ షూటర్ ప్రభుత్వ ప్రోత్సాహం కోసం ఎదురు చూస్తున్నాడు. మద్దతిస్తే మరిన్ని అద్భుతాలు సాధిస్తానంటున్న ధనుశ్‌పై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం.**

*నమస్తే తెలంగాణ క్రీడావిభాగం*

తెలంగాణలో ప్రతిభ కల్గిన క్రీడాకారులకు కొదువలేదు. వెన్నుతట్టి ప్రోత్సహించాలే కానీ..అద్భుతాలు సృష్టించే ప్లేయర్లు కోకొల్లలు. ఇప్పుడే ఇదే కోవలోకి వచ్చాడు యువ షూటర్ ధనుశ్ శ్రీకాంత్. పుట్టుకతోనే వినికిడి సమస్యతో జన్మించిన ధనుశ్ ఏనాడు నిరాశకు లోనుకాలేదు. ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని చేతల్లో చూపిస్తూ షూటింగ్‌లో దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తున్నాడు. ఇటీవలే జర్మనీలో జరిగిన ప్రపంచ డెఫ్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణ పతకాలు సాధించిన నేపథ్యంలో ధనుశ్ ప్రస్థానంపై అతని తల్లి ఆశా శ్రీకాంత్ పలు అంశాలు పంచుకుంది.

### పసి ప్రాయం నుంచే :

పువ్వు పుట్టగానే పరిమళించింది అన్నట్లు పసి ప్రాయం నుంచే ధనుశ్ క్రీడల పట్ల అమితాసక్తి ప్రదర్శించాడు. స్కూల్‌లో నిర్వహించే ప్రతీ క్రీడాపోటీల్లో పతకంతో వచ్చేవాడు. అతని ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు మూడో తరగతిలో ఉన్నప్పుడే తైక్వాండోలో చేర్పించారు. ఇంట్లో సరదాగా బొమ్మ తుపాకీతో గంటల తరబడి ధనుశ్ ప్రాక్టీస్ చేసేవాడని తల్లి ఆశ తెలిపింది. అతని ఆసక్తిని గమనించిన పేరెంట్స్ 2015లో గగన్ నారంగ్‌కు చెందిన 'గన్ ఫర్ గ్లోరీ' అకాడమీలో చేర్పించారు. ఇక అక్కడి నుంచి వెనుదిరిగి చూసుకోలేదు. 2019లో జరిగిన తెలంగాణ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో 400కు 400 షూట్ చేసిన తొలి షూటర్‌గా శ్రీకాంత్ రికార్డు నెలకొల్పాడు.

### గురువుకు తగ్గ శిష్యుడు:

లండన్ ఒలింపిక్స్ కాంస్య విజేత గగన్ నారంగ్‌కు తగిన శిష్యుడని ధనుశ్ నిరూపించుకుంటున్నాడు. గురువుకు తగ్గట్లే 10మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో పతకాల పంట పండిస్తున్నాడు. కెరీర్ మొదలుపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు వేర్వేరు అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో 13 పతకాలు సాధించాడు.

### ప్రపంచ రికార్డులతో స్వర్ణాలు:

ప్రపంచ డెఫ్ షూటింగ్ టోర్నీలో ధనుశ్ 10మీ ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో రెండు ప్రపంచ రికార్డులు(632.7, 251.7) తన పేరిట లిఖించుకున్నాడు. వ్యక్తిగత విభాగంతో పాటు మిక్స్‌డ్ కేటగిరీలో భారత్‌కు రెండు పసిడి పతకాలు అందించాడు. ఇదే జోరుతో 2028లో లాస్‌ఎంజిల్స్ ఒలింపిక్స్ లక్ష్యంగా ధనుశ్ ముందుకెళ్తాడని ధనుశ్ తల్లి పేర్కొంది.

### ప్రభుత్వ ప్రోత్సాహం కోసం:

అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న ధనుశ్‌ను ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. ఖరీదైన క్రీడ అయిన షూటింగ్‌లో రాణించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆశ పేర్కొంది. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే..భవిష్యత్‌లో దేశానికి ధనుశ్ మరిన్ని పతకాలు తీసుకొస్తాడని ఆమె తెలిపింది.

## ప్రిక్వార్టర్స్‌లో ఓడిన త్రిసా జోడీ

హాంకాంగ్: భారత బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్ జోడీ త్రిసా జాలీ, గాయత్రి గోపీచంద్.. హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రిక్వార్టర్స్‌లో ఓటమిపాలైంది. ప్రిక్వార్టర్స్‌లో భారత జోడీ.. 11-21, 20-22తో లియు షెంగ్ - టాన్ నింగ్(చైనా) చేతిలో ఓడింది. తొలి గేమ్‌లో ప్రత్యర్థి దూకుడుకు చిత్తైన మన అమ్మాయిలు.. రెండో గేమ్‌లో హోరాహోరీగా పోరాడినా ఫలితం వారికి అనుకూలంగా రాలేదు.

## ఆసీస్ బోణీ

**రాణించిన ట్రావిస్ హెడ్**

సౌతంప్టన్ (ఇంగ్లండ్): ఇంగ్లండ్ పర్యటనను ఆస్ట్రేలియా గెలుపుతో ఆరంభించింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా సౌతాంప్టన్ వేదికగా ముగిసిన తొలి మ్యాచ్‌లో కంగారూలు.. 28 పరుగుల తేడాతో ఇంగ్లీష్ జట్టును ఓడించారు. మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్.. 19.3 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌట్ అయింది. విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ (23 బంతుల్లో 59, 8 ఫోర్లు, 4 సిక్సర్లు), మాథ్యూ షార్ట్ (26 బంతుల్లో 41, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) ధాటిగా ఆడారు. జోష్ ఇంగ్లిస్ (37) కూడా వేగంగా ఆడటంతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది. అనంతరం ఛేదనలో ఆతిథ్య జట్టు 19.2 ఓవర్లలో 151 పరుగులకే ఆలౌట్ అయింది. ఇంగ్లండ్ రెగ్యులర్ కెప్టెన్ జోస్ బట్లర్ గైర్హాజరీలో సారథ్య పగ్గాలు అందుకున్న ఫిల్ సాల్ట్ (20) బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. లివింగ్‌స్టోన్ (27 బంతుల్లో 37, 4 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేయగా మిగిలినవారూ చేతులెత్తేశారు. ఆసీస్ బౌలర్లలో సీన్ అబాట్ (3/28) మూడు వికెట్లు తీయగా జంపా, హెజిల్‌వుడ్ తలా రెండు వికెట్లు పడగొట్టారు.

## భారత్ జోరు

హులన్‌బుయిర్ (చైనా): ఏషియన్ చాంపియన్స్ హాకీ ట్రోఫీలో భారత్ విజయ పరంపర దిగ్విజయంగా కొనసాగుతోంది. లీగ్ దశలో ఇప్పటికే మూడు మ్యాచ్‌లను భారీ తేడాతో గెలిచిన మెన్ ఇన్ బ్లూ.. గురువారం జరిగిన మ్యాచ్‌లో 3-1తో దక్షిణ కొరియాను ఓడించింది. అరేజిత్ సింగ్ (8వ నిమిషంలో) తొలి క్వార్టర్‌లోనే గోల్ చేయగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 9, 43వ నిమిషాలలో రెండు గోల్స్ సాధించాడు. సౌత్ కొరియా నుంచి యంగ్ జిహున్ ఒక్కడే 30వ నిమిషంలో గోల్ చేశాడు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.